లేటెస్ట్ ట్రెండ్ పచ్చని కానుక



శ్రీకాకుళంలోని ఓ షాపులో విక్రయానికి సిద్ధంగా ఉన్న పూలమొక్కలు

- బొకే, దండలు, స్వీట్స్‌కు బదులుగా మొక్కలు
- నగరంలో పెరుగుతున్న మొక్కల బహుమతుల సంస్కృతి
- నర్సరీలతో పాటు రోడ్డు పక్కన పెరిగిన విక్రయాలు

శ్రీకాకుళం: నగరంలో సరికొత్త ట్రెండ్ మొదలైంది. పుట్టిన రోజు, నూతన సంవత్సర, వివాహ, ఇతర శుభకార్యాలయ సమయంలో బహుమతులు, బొకేలు, పూలదండలు, స్వీట్స్..బదులుగా మొక్కలు అందజేసే సంస్కృతి మొదలైంది. గతంలోనూ ఈ పద్ధతి ఉన్నా ఇటీవల కాలంలో పర్యావరణ స్పృహ పెరగడంతో మొక్కల రూపంలో పచ్చని కానుకలు అందించడం ఊపందుకుంది. ఇంటి గోడలపై, ఇంటీరియల్, పెరడు, మెట్లు వద్ద పెంచుకునేందుకు వీలుగా వివిధ రకరకాల మొక్కలను బహుమతిగా ఇస్తున్నారు.

పచ్చదనం పెం(ప)ంచుకోవటంతో పాటు ఇంటీరియల్ డెకరేషన్‌గా వీటిని వినియోగిస్తున్నారు. పచ్చదనం ఇష్టపడే ఏ ఇంట్లో చూసినా ప్రతీ మూలన ఏదో ఒకరకమైన మొక్కలు కనిపిస్తునే ఉంటాయి. ఇలా చేయడం వల్ల ఆక్సిజన్ పుష్కలంగా అందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తమవంతు సాయం చేసినట్లు అవుతుందని పర్యావరణ అభిమానులు చెబుతున్నారు.

గిఫ్ట్‌లు బదులుగా..

నూతన సంవత్సర వేడుకలు, ముఖ్య నాయకుల ఇళ్లల్లో జరిగే జన్మదిన, వివాహ మహోత్సవ వేడుకల్లో ఆకట్టుకునేలా మొక్కలు ఇచ్చే సంస్కృతి ఇటీవల కాలంలో బాగా పెరిగింది. బదిలీపై వచ్చే ప్రభుత్వ ఉద్యోగులకు దిగువ స్థాయి ఉద్యోగులు ఆత్మీక కలయిక సమయంలో రకరకాల గిఫ్టులు ఇచ్చే బదులుగా మంచి మొక్కను బహుమతిగా అందిస్తున్నారు.



శ్రీకాకుళంలోని ఓ షాపులో విక్రయానికి సిద్ధంగా ఉన్న పూలమొక్కలు

చిన్నచిన్న మొక్కలు...

ఇళ్లు, ఇంటి పరిసరాల్లో పెంచుకుందనేందుకు చిన్నవిగాను, చూసేందుకు అందంగాను కనిపించే చిన్నచిన్న మొక్కల విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. 4, 5, 6 అంగుళాల కుండీల్లో గిఫ్ట్ ప్లాంట్స్ అందుబాటులో ఉంచుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న నర్సరీలతో పాటు వీటి విక్రయాలు రోడ్డు పక్కన కూడా జోరుగా సాగుతున్నాయి. మొక్క రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

సంతోషిమాతకు పూజలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో వేంచేసిన సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు పాలతో, పసుపు నీళ్లతో అభిషేకాలు నిర్వహించి, అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. ఉద్యాపనులు, మహా నివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారిని పూలతో అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్‌కు గాయాలు

రణస్థలం: మండలంలోని నగరపాలేం గ్రామానికి చెందిన వలంటీర్ కెల్ల ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: రైజింగ్‌స్టార్ వాకర్స్ సౌజన్యంతో ఉచితం మజ్జిగ పంపిణీని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు ఎంఎస్‌ఆర్ మూర్తి ఆధ్వర్యంలో పాదచారులు, వాహనదారులకు మజ్జిగను అందజేసి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించారు. క్లబ్ వ్యవస్థాపకులు కూన వెంకటరమణమూర్తి, గౌరవ అధ్యక్షులు మొదలవలస వాసుదేవరావు, కార్యదర్శి రత్నాల జగన్మోహన్, కోశాధికారి జినగ పార్వతీశం, డైరెక్టర్లు బొడ్డేపల్లి రాంబాబు, పిరియ జయకృష్ణ, జి.ప్రకాశరావు, గంగాధర్ రావు, కూన నరసింహ అప్పారావు, గిరిధర్, చింతాడ వెంకటేశ్వరరావు, తమ్మినేని రవి, పొందూరు అప్పారావు, పైల ఆనందరావు, మురళీ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధినిరోధక టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ నైరా కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం పశువులు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ.. పశువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందే వ్యాధుల్లో టీబీ, బ్రూసెల్లోసిస్, రాబీస్ వంటివి ఉన్నాయని..వీటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్వర్టులు నిర్మించాలని విజ్ఞప్తి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే మార్గంలో రాగోలు వద్ద రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రానున్న వర్షాకాలం దృష్ట్యా ముందస్తుగానే ఆర్టీసీ కాంప్లెక్స్, చర్చి వద్ద కల్వర్టులు ఏర్పాటు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు బోర చిన్నంనాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో సుమారు రూ.58 కోట్లతో పది కిలోమీటర్లు పొడవునా 80 అడుగుల వెడల్పుతో నాలుగు లైన్ల రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. డివైడర్ మధ్యలో విద్యుత్ లైన్లు, మొక్కలు నాటే పనులు పూర్తి చేసేలోగా కల్వర్టు పనులు పూర్తి చేయాలని కోరారు.

కె.సైరిగాంలో కార్డన్ సెర్చ్



వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

గార: మండలంలోని కె.సైరిగాం పంచాయతీలో శుక్రవారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్సై కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం గ్రామంలోని అన్ని వీధులను జల్లెడ పట్టారు. వాహనాల ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. అనుమానాస్పందగా వాహనాలు, వ్యక్తులు కనిపించినా సమాచారమివ్వాలని ఎస్సై ప్రజలను కోరారు.

రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట గ్రామంలో ఉన్న శ్రీరంగనాథ స్వామివారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యేక పూజలు చేపట్టారు. అష్టోత్తర శత కలశాభిషేక మహోత్సవం, పంచామృత అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఈ ప్రత్యేక పూజలు ప్రారంభించారు. తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించి, అనసమరాధన కార్యక్రమం జరిపారు. సేవాట్రస్ట్ ప్రతినిధులు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి విగ్రహం

మహానుభావులు చంద్రశేఖరేంద్ర సరస్వతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న మహనీయుల ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతిపై వక్త సనపల నారాయణమూర్తి ఉపన్యసించారు. చంద్రశేఖరస్వామి ఎంతో రాజనీతజ్ఞులని, అన్ని మతాలకు సమాన ప్రాతినిధ్యం రాజ్యాంగంలో కల్పించేందుకు కృషి చేశారని అన్నారు. ముందుగా వక్త నారాయణమూర్తిని మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వి.కామేశ్వరరావు, హరనాథరావు, పతంజలి శాస్త్రి, నిష్టల నర్సింహమూర్తి, వెంకటరావు, జి.విశ్వేశ్వరరావు, పి.వి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.



నారాయణమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

ముగిసిన కామేశ్వరమ్మ పండుగలు



కలశంతో ఊరేగింపు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు



కామేశ్వరి తల్లికి పట్టాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయం వద్దగల కామేశ్వరీ తల్లి అమ్మవారి పండుగలు శుక్రవారంతో ముగిశాయి. అర్చకులు ధర్బముళ్ల ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో సంప్రదాయంగా అమ్మవారికి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి కలశాన్ని ఊరేగించి తిరిగి ఆలయంలో పెట్టెలో ఉంచారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో కామేశ్వరీ అమ్మవారికి విశేష ఆరాధనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవతి

జి.సిగడాం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీపీ మీసాల సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన ఎన్నికలో కార్యకర్తలంతా సైనికులా పని చేయడంతో, మండలంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ వస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటమరణ, వైస్ ఎంపీపీలు మీసాల సాధ్వీమణి, తోలేటి వెంకటరావు, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, ఎంపీటీసీలు కె.సుజాత, కుమరాపు రమేష్‌నాయుడు, పెద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

21 రౌండ్లలో నరసన్నపేట ఫలితం

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో అందరూ కౌంటింగ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 1,73,827 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 88,189 మంది, పురుషులు 85,638 మంది ఓటు వేశారు. అయితే జూన్ 4న కౌంటింగ్‌కు అధికారులు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎచ్చెర్లలోని శివానీ కళాశాలలో కౌంటింగ్ నిర్వహిస్తారు. మొత్తం 21 రౌండ్లలో నరసన్నపేట కౌంటింగ్ పూర్తవుతుందని ఆర్వో రామ్మోహనరావు తెలిపారు. దీనికోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో టేబుల్‌కు 14 పోలింగ్ కేంద్రాల ఈవీఎంలు పంపి కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ లెక్కన ముందుగా జలుమూరు మండలం శ్రీముఖలింగం నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈ మండలంలో 74 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఐదున్నర రౌండ్లలో ఫలితం వస్తుంది. ఆరో రౌండ్ నుంచి నరసన్నపేట మండలం కౌంటింగ్ ఉంటుంది. ఈ మండలంలో 82 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నరసన్నపేట మండలం తర్వాత సారవకోట మండలం లెక్కింపునకు వస్తుందని అధికారులు వెల్లడించారు. చివరగా పోలాకి మండలంలోని పోలింగ్ కేంద్రాల లెక్కింపు జరుగుతుందని దీంతో లెక్కింపు పూర్తి అవుతుందన్నారు. అలాగే ఒక్కో టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్ ఉంటారని పేర్కొన్నారు.

బాధితులకు సకాలంలో సేవలు



పాతపట్నం: వాహనాన్ని పరిశీలిస్తున్న జగన్

సరుబుజ్జిలి: బాధితులకు సకాలంలో 108 అంబులెన్స్ సేవలు అందించాలని శ్రీకాకుళం డివిజన్ అధికారి ఎల్.నవీన్ సూచించారు. మండల కేంద్రంలోని 108 వాహనాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అంబులెన్స్ పనితీరు, అత్యవసర మందులు, డ్యూటీ రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు ఈఎంటీ మునికోటి ఈశ్వరరావు, పైలెట్ ధవళ శ్రీనివాసరావు ఉన్నారు.

పాతపట్నం: అత్యవసర సమయాల్లో మరింత బాధ్యతగా పనిచేయాలని, 108 వాహనం సేవలను ప్రజలకు అందించాలని 108 పలాస డివిజన్ అధికారి జి.జగన్ అన్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో ఉన్న 108 వాహనాన్ని శుక్రవారం పరిశీలించారు. వాహనం పనితీరు, పరికరాలు, ఎమర్జెన్సీ డ్రగ్ రికార్డు, సిబ్బంది రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. బాధితుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ టెక్నీషియన్ కె.అఫీస్, పైలట్ చిన్న, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

జలుమూరు: వేసవి దృష్ట్యా ఎండ వేడిమి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అందరూ వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం జలుమూరు పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలు దాటిన తర్వాత బయటకు వెళ్లవద్దని సూచించారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వదులుగా ఉండే కాటన్, ఖద్దరు దుస్తులు ధరించడంతో పాటు తలకు టోపి పెట్టుకోవాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్తే గొడుగు తీసుకెళ్లాలని సూచించారు. వడదెబ్బ తగిలితే వైద్యు డిని సంప్రదించి సూచనలు తీసుకోవాలని, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'



సర్వేశ్వరపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మధుసూదనరావు

జి.సిగడాం: గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించినా, ఓట్లు లెక్కింపు అనంతరం పల్లెల్లో విజయోత్సవాలు సందర్భంగా ఘర్షణలు చేసుకున్నా చర్యలు తప్పవని ఎస్‌ఐ వై.మధుసూదనరావు హెచ్చరించారు. మండలంలోని డీఆర్‌వలస, ముషినివలస, సర్వేశ్వరపురం గ్రామాల్లో ఇరువర్గాల నాయకులు, గ్రామస్తులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఇప్పటికే ఇరువర్గాల నుంచి బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం సజావుగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడేళ్లుగా చిన్న చిన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చినా ఇంకా పరిష్కారం కాలేదని కొంతమంది సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు.

గ్రామాల్లో ఉపాధి హమీ పథకం పనులపై సర్పంచ్‌లకు కనీస సమాచారం ఇవ్వకపోవడం సరికాదని సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరావు, బగాది అప్పలనాయడు, తిరుమరెడ్డి వెంకటరావులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీపీ సత్యవతి, ఎంపీడీవో కె.వెంకన్నబాబు సమాధానం ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వివిధ రకాల పనులపై తప్పకుండా సమాచారం ఇస్తామన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. అలాగే సాగునీరు, తాగునీటిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నిర్మల, ఐసీడీఎస్ పీవో డోల పాపినాయుడు, సూపర్‌వైజర్ లక్ష్మి, వైద్యాధికారి పేకల సుమబిందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సింహ వాహన సేవ



సింహ వాహనంలో ఊరేగుతున్న స్వామివారు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా 7వ రోజు శుక్రవారం సింహ వాహన సేవ జరిగింది. ఆలయం నుంచి సింహ వాహనంపై స్వామివారు ఊరేగారు. పెద్దపేట మీదుగా మెయిన్ రోడ్డు, పాతబస్టాండ్ కూడలి వరకూ ఊరేగింపు జరిగింది. మహిళలు ఎక్కడిక్కడ హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం



ఊరేగింపులో పాల్గొన్న పట్టణ ప్రజలు